


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

తొలి విడత: ఫన్ నేనొక్కడినే

హానోఫర్ ముచ్చట్లు

ఈ భూమి మనిషిది. మనిషి అంటే మగాడూ కావచ్చు, మగువా కావచ్చు. వారిద్దరూ జంటగా కలిసినప్పుడే మనిషి అన్న పదం సంపూర్ణమౌతుంది. మన అర్ధనారీశ్వరతత్వం సూచించేది అదే!

అంటే జత కట్టని ప్రతి వ్యక్తీ సగం మనిషే. అలా అప్పుడు ట్రయిన్లో నాతో పయనిస్తున్న కొరియా, నటరాజన్, దేవ్‌దార్ – సగం మనుషులే. జత కట్టినా ప్రస్తుతానికి ఒంటరినే కాబట్టి నేనూ సగం మనిషినే.

పరాయి దేశం. సంపన్నదేశం. ఎన్నింట్లోనో ముందున్న దేశం. అక్కడ ఇప్పటికి నాలుగు నెలలు గడిపాం. కనీసం ఇంకో ఏడాది అక్కడ గడుపుతాం. బోలెడంత ఫన్.

నా మిత్రులు ముగ్గురూ ఆ ఫన్ ఎంజాయ్ చేస్తూ, మధ్యమధ్య భావిలో తమ జంట జీవితానికి సంబంధించిన కలలు కంటుంటారు. నేను మాత్రం ఆ ఫన్ నేనొక్కడినే అనుభవించాల్సొచ్చిందని మథన పడుతుంటాను.

అదీ వాళ్లకీ నాకూ తేడా!

ఇండియాలో మేము పని చేసే సంస్థల్లో బదిలీలుండవు. అందుకని చదువైనప్పట్నించీ ఒకే ఊళ్లో ఉద్యోగం. రిటైరయ్యేదాకా ఆ ఊళ్లోనే ఉంటాం. ఉద్యోగరీత్యా ఊరొదలడం కొంచెం కొత్తగా ఉంది.

నాలుగు నెలల్లో ల్యూనబర్గు మా ఊరైపోయింది. మేమంతా ఒకరికొకరయ్యాం. ఇప్పుడు ఎవరికివారుగా విడిపోవడమే కాదు, ల్యూనబర్గును కూడా మర్చిపోవాలి.

నేను దీర్ఘాలోచనలో ఉన్నాను. “అటు చూడు, వాళ్లెంత బాగున్నారో” అన్నాడు నటరాజన్.

చూశాను. ఇద్దరు జర్మన్ యువతులు. వయసు ఇరవైలోపే అనిపిస్తుంది. వాళ్లలో అందం, ఉత్సాహం ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి.

చూడగానే కళ్లు తిప్పుకోలేకపోయాను.

అందం ఆడవాళ్ల సొత్తు. అందువల్ల మనుషుల్లో అందాన్ని అద్దం అవసరం లేకుండా చూడగల అదృష్టం మగాళ్లకే లభిస్తుంది.

కొంత ఆలోచన. కొంత ఆకర్షణ. కొద్ది క్షణాలు వాళ్లని కళ్లప్పగించి చూశాను.

ఇద్దరమ్మాయిలూ అది గమనించారు. ఏమనుకున్నారో, ఇద్దరూ ఒక్కసారి నన్ను చూసి మందహాసం చేశారు.

నేనది ఊహించలేదు. ఆ నవ్వుకి ఎలా స్పందించాలి?

వాళ్ల నవ్వు నిష్కల్మషంగా, అపరిచిత యువతులనుంచి అంతవరకూ నాకు అపరిచితమైన ఓ వింత స్నేహభావముంది.

“జీ సింద్ జేర్ ష్యోన్” (యు ఆర్ వెరీ బ్యూటిఫుల్) అన్నాను అప్రయత్నంగా ఇద్దర్నీ ఉద్దేశించి.

అక్కడ అపరిచిత యువతి అందాన్ని పొగడ్డం అభినందనే కానీ, గర్హించాల్సిన విషయం కాదు.

వాళ్లు కొంచెం సిగ్గుపడ్డారు. ఆ సిగ్గు వాళ్ల అందాన్ని రెట్టింపు చేసింది.

“డాంకే” (థాంక్స్) అన్నారు యుగళంగా. తర్వాత మా గురించి అడిగారు.

నాలుగు మాసాలు గ్యోతే ఇన్‌స్టిట్యూట్ జర్మన్ అభ్యసించామని చెప్పాను. వాళ్లు వెంటనే – అంత తక్కువ కాలంలో జర్మన్ ఎంతో చక్కగా మాట్లాడేనని మెచ్చుకున్నారు. వాళ్లకి ఇంగ్లీషు రాదుట.

ఇతర భాషలపై పట్టు విషయంలో నా సత్తా నాకు తెలుసు. మెచ్చుకోవడం వాళ్ల మర్యాద. రెచ్చిపోకుండా వీలైనంత తక్కువ మాట్లాడితేనే నా మర్యాద నేను నిలబెట్టుకున్నవాడినౌతాను.

వాళ్లకి "డాంకే" చెప్పి నా దృష్టిని వాళ్లనుంచి మరల్చాను.

జర్మనీలో చాలాచోట్ల గమనించాను. ఇద్దరు పౌరులు, ముఖ్యంగా ఆడవాళ్లు కలిస్తే, ఊపిరి తీసుకుందుకు కూడా ఆగకుండా కిచకిచమంటుంటారు. మాటలమధ్య వాళ్ల హావభావాలు తెగ మారిపోతుంటాయి.

నేను దృష్టి మరల్చుకోగానే ఆ యువతులిద్దరూ మళ్లీ వాళ్ల కబుర్లలో పడిపోయారు.

"ఛుపా రుస్తం నిక్‌లా యార్" అన్నాడు నటరాజన్.

అంతవరకూ వాళ్లా యువతుల్ని ఓరగానే తప్ప నేరుగా చూడలేదు. అందుకని వాళ్లకి ఆ చిరునవ్వులు దొరకలేదు. అలా నేను వాళ్లకి ఛుపారుస్తం అయ్యాను.

ఆ యువతులకి హిందీ అర్థం కాదు కాబట్టి మేమేమైనా మాట్లాడుకోవచ్చు. ఐతే మేమంతా సైంటిస్టులం. మా భాష మా హోదాకు తగ్గట్లుగానే ఉంది.

కాసేపు సరదాగా కబుర్లు చెప్పుకున్నాం. నటరాజన్‌కి ఆ యువతుల్ని ఆకర్షించి ఓ చిరునవ్వు పొందాలని మనసుగా ఉంది. పలకరిస్తే భాష ఇబ్బంది.

"నువ్వోసారి పలకరించు. నీకేసి చూసినప్పుడు నేనూ వాళ్లకేసి చూస్తాను" అన్నాడు నటరాజన్ దేవ్‌దార్‌తో.

"ఏమని పలకరించను? పలకరించేక వాళ్లకీ మనకీ కామన్ టాపిక్కు ఏముంటాయి? ఏమైనా టాపిక్కు సృష్టించినా మన ప్రయాణ కాలం గంటా ఏడు నిముషాలు. అందులో ఇప్పటికి ఇరవైరెండు నిముషాలు ఐపోయాయి" అన్నాడు దేవ్‌దార్ – అసలుసిసలు యూనివర్సిటీ ప్రొఫెసర్‌లా.

నటరాజన్ తనని అడిగేలోగా కొరియా తనే అతడి భుజం తట్టి, "పలకరించడానికి నాకే ఇబ్బందీ లేదు కానీ, బయల్దేరే ముందురోజు క్షౌరం చేయించుకోవాలనుకున్నాను. కుదర్లేదు. నా జుట్టు పొడుగ్గా అసహ్యంగా ఉంది" అంటూ తన జుట్టుకీ ఆ పలకరింపుకీ లంకె పెట్టాడు.

మన మగాళ్లు ఆడపిల్లల్ని పలకరించడానికే ఇంతలా తర్జనభర్జన పడే ఆసక్తికరమైన రోజులవి.

నటరాజన్ దగ్గర హెయిర్ కటింగ్‌కి ట్రిమ్మర్ సెట్ ఉంది. దాన్ని కొరియామీద ప్రయోగిస్తే – ఆ యువతుల దృష్టి ఇటు మళ్లడంతోపాటు, ట్రయిన్లోనూ ఓ కొత్త కాలక్షేపం.

"మై నాయీ బనూంగా యార్" అన్నాడు నటరాజన్.

ఆశ్చర్యంగా కొరియా దీనికి అభ్యంతరపెట్టలేదు.

"ఇది జర్మనీ. కింద ఒక్క వెంట్రుక కూడా పడకూడదు. పడిందో బుక్కైపోయామే" అన్నాడు దేవదార్.

అప్పుడు చూశాను అద్భుతం. నటరాజన్ తన ఎయిర్ బ్యాగులోంచి ఓ గుడ్డ తీశాడు. ఉరేస్తున్నాట్లుగా కొరియా మెడచుట్టూ బిగించాడు. దానిని విడమర్చి కొరియాని చేత్తో పట్టుకోమన్నాడు. తర్వాత బ్లేడ్సున్న ఓ దువ్వెన, ఓ కత్తెర తీశాడు. ఐదు నిముషాల్లో కొరియా జుట్టు పొట్టిగా ఐపోయింది.

ఒక్క వెంట్రుక గుడ్డని దాటి పోలేదు. కొరియా క్రాపు కూడా ఎగుడుదిగుడుగా అనిపించలేదు.

వాళ్ల కోరిక ఫలిచి ఆ యువతులు మధ్యమధ్య వాళ్లని చూసి చిరునవ్వులు చిందిస్తూ తమ కబుర్లలో తామున్నారు.

"వెరీ ప్రొఫెషనల్. నీ ఇన్‌స్టిట్యూట్‌లో సైడ్ బిజినెస్ పెట్టొచ్చు" అంటూ దేవ్‌దార్ నటరాజన్ని అభినందించాడు.

"నువ్విక్కడంటున్నావా, నేను ఏకంగా ఇండియాలోనే...." అని నవ్వేశాడు నటరాజన్.

అతగాడు కొరియా జుట్టుని – ట్రయిన్లో ఉన్న చెత్తబుట్టలోకి పంపేశాడు.

"వాళ్లు మళ్లీ ఇటు చూడరేం?" అన్నాడు నటరాజన్ ఆ యువతుల గురించి.

"నువ్వు మొహమాటపెట్టి వాళ్లమీద కూడా నీ టాలెంటుని ప్రయోగిస్తావని భయపడుతున్నారేమో" అన్నాను.

ఏదేమైనా వాళ్లు మళ్లీ మమ్మల్ని చూడలేదు. సరిగ్గా 12.23కి మా ట్రయిన్ హానోఫర్ (హానోవర్) చేరుకుంది.

మేము ట్రయిన్ దిగుతుంటే, అప్పుడు మాత్రం ఆ యువతులు మాకు స్నేహపూర్వకంగా బై చెప్పారు.

నా చేతిలో ఓ సూట్‌కేసు. భుజానికి వ్రేలాడుతూ ఓ సంచీ. చీటికీ మాటికీ సూట్‌కేస్ తెరవాల్సిన అవసరం లేకుండా – బ్రష్షూ పేస్టూ సబ్బూ దువ్వెనా లాంటివీ, కొంచెం తేలికపాటి ఆహారమూ కాక ఓ స్వెటరు కూడా ఉన్నదా సంచిలో.

మిగతావాళ్లకీ ఒకో సూట్ కేసూ, ఓ హ్యాండు బ్యాగూ ఉన్నాయి – కాస్త సైజుల తేడాలో.

నేను సంచిలో మొయ్యడంకంటే వంటిమీద మొయ్యడం సులువని స్వెటర్ వేసుకున్నాను.

ప్లాట్‌ఫారంమీద కాలు పెట్టగానే, "కొత్తగా ఉంది" అన్నాడు నటరాజన్.

హానోఫర్ ప్లాట్‌ఫాం మాకు కొత్త కాదు. కొన్నాళ్లక్రితం ల్యూనబర్గునుంచి ఈ ఊరు చూడ్డానికొచ్చి ఇక్కడే దిగాం. అప్పుడు మాతో సూట్‌కేసులు లేవు. ఊరు చూడ్డమయ్యేక మళ్లీ – మాకు తెలిసిన ఊళ్లో, మాకు తెలిసిన ఇంట్లో, మేమెరిగిన మనుషులమధ్యకి – వెళ్లిపోతామన్న ధైర్యముంది.

ఇప్పుడు ల్యూనబర్గుకీ మాకూ ఋణం చెల్లిపోయింది. ఒకొక్కరు ఒకో కొత్త ఊరెళ్లి స్థిరపడి కనీసం ఏడాదిపాటు ఉంటాం.

నేను వెడుతున్నది చరిత్ర ప్రసిద్ధి గాంచిన బెర్లిన్ నగరం.

పై చదువులకని రాజమండ్రినుంచి వైజాగూ, ఉద్యోగానికి వైజాగునుంచి భువనేశ్వరూ వెళ్లేటప్పుడు ఎలాంటి అనుభూతులు కలిగాయో – అవే ఇప్పుడూనూ!

ఉన్నట్లుండి ల్యూనబర్గు నా స్వంత ఊరూ, బెర్లిన్ పరాయి ఊరూ ఐపోయాయి.

మేము నాలుగడుగులు వెయ్యగానే షూ పాలిష్ ఆటోమాట్ కనబడింది. దేవదార్ సరదా పడ్డాడు – ఆటోమేటిక్ యంత్రంలో బూట్ పాలిష్ చేయించుకోవాలని. అందుకు రుసుము 20 ఫెన్నిగ్సు. తన దగ్గర చిల్లరలేకపోయేసరికి నిరుత్సాహపడ్డాడు. మిగతా ఇద్దరి దగ్గరా కూడా చిల్లర ఉన్నట్లు లేదు. కానీ నాదగ్గర ఒకటినుంచి యాభై ఫెన్నిగ్సు దాకా అన్ని రకాల నాణేలూ ఉన్నాయి. అతడికో ఇరవై ఫెన్నిగ్సు నాణెమిచ్చాను. మా అందరికీ, ఆటోమాట్ పాలిష్ చూడ్డమే ఓ వింత. అతగాడికి అదనంగా షూ పాలిష్. మాకు కళ్లు మాత్రమే మెరిస్తే, అతగాడికి షూస్ కూడా మెరిశాయి.

ఇక మేము ఆ రోజంతా అక్కడే గడపాలి. ఐతే హొటల్లో దిగే ఉద్దేశ్యం మాలో ఎవరికీ లేదు. ఎందుకంటే –

రైల్వేస్టేషన్లో లాకర్ పేరిట చక్కని సదుపాయముంది. లాకర్‌కి ఉన్న చిన్ని కన్నంలో ఒక మార్కు, యాభై ఫెన్నిగ్సు నాణేలు వేస్తే అందులోంచీ తాళం చెవి బయటకొస్తుంది. తాళంచెవితో లాకర్ తెరిచి, అందులో సూట్‌కేస్ ఉంచి, లాకర్ మూసి, తాళం వేసేయొచ్చు. ఇరవైనాలుగు గంటల్లోపల ఆ తాళంతో లాకర్ని మళ్లీ తెరవచ్చు. ఆ టైం దాటితే మాత్రం మళ్లీ లాకర్ కన్నంలో ఒకటిన్నర మార్కులు వేస్తేనే ఆ తాళం పనిచేస్తుంది.

రోజంతా రోడ్లు పట్టి తిరగాలనుకుంటున్న మాకు, సామాను దాచుకుందుకు తప్ప, హొటలు రూమెందుకు?

మేము విన్న ప్రకారం ఈ లాకరు సదుపాయం పనితీరులో యూరప్‌లోని ఏ దేశమైనా కూడా జర్మనీ తర్వాతనేనట.

హానోఫర్లో హెర్రెన్ హౌసెన్ గార్డెన్స్ పేరెన్నికగన్నవి. ఇదివరలో వాటిని హడావుడిగా చూశాం. ఈసారి తీరుబడిగా చూద్దామనుకున్నాం.

మాలో ఇప్పుడు వచ్చిన పెద్ద మార్పు ఏమిటంటే, జర్మనీలో ఎంత కొత్త ప్రదేశంలోనైనా నిర్భయంగా, నిస్సంకోచంగా తిరగగల్గుతున్నాం. ఓ మ్యాప్ పట్టుకుని మాకు కావాల్సిన చోటుని వెదుక్కుంటూ వెళ్లిపోగలం. అక్కడి నగర పటాలు సామాన్యులకు కూడా సులభ గ్రాహ్యమయ్యేలా ఉంటాయి. చిరునామా తెలిస్తే తెలియని ప్రదేశాలే కాదు, ఇళ్లు కూడా అతి సులభంగా పట్టుకోవచ్చు.

ముందు హెర్రెన్ హౌసెన్ గార్డెన్స్‌కి వెళ్లాం నడుచుకుంటూ. గార్డెన్ ఇదివరకటికంటే చాలా బాగా అనిపించింది. కొన్ని ఫొటోలు తీసుకున్నాం. ఎటొచ్చీ ఆ రోజు వనవిహారానికి అంత అనువుగా లేదు. ఆకాశం మబ్బులతో నిండిపోయింది. అడపాతడపా వానజల్లులు.

ఆ వాతావరణంలో – ఇక ఊళ్లో ఏం తిరుగుతాం? గార్డెన్‌తోనే సరిపెట్టుకోవాలా అనుకున్నాం.

ఏదేమైనా ముందు భోజనం చేసి తర్వాత మిగతా ప్రోగ్రాం గురించి ఆలోచిద్దామనుకుని – మమ్మల్ని వానజల్లులనుంచి కాపాడగల నీడ కోసం వెదుకుతున్నాం.

ఆ ప్రయత్నంలో నీడకంటే ముందు మాకు ఫ్రాంకా తగిలాడు. ల్యూనబర్గ్లో మాతోపాటు తనూ ఓ గ్యోతే ఇన్‌స్టిట్యూట్ విద్యార్థి. దేశం ఫిలిప్పిన్సు.

మమ్మల్ని చూస్తూనే ఇంత మొహం చేసుకుని పలకరించి, "తోడుకోసం చూస్తున్నాను. భలే దొరికారు" అన్నాడు.

మాకైతే అతణ్ణి చూడగానే నీరసమొచ్చింది. తినడానికి ల్యూనబర్గ్నుంచే తలా ఒక ఐటమూ తెచ్చుకున్నాం. వాటిలో దేవదార్ వండిన అన్నం, కొరియా హస్తపాకంతో బంగాళా–సిమ్లామిర్చి కూర ఉన్నాయి. నటరాజన్ వైను తీసుకొస్తే, నేను ఆపిల్సు తెచ్చాను. మోసుకుని తిరగాల్సి ఉంటుందని తెలిసి, మరీ ఎక్కువ తెచ్చుకోలేదు. మా నలుగురికీ బొటాబొటిగా సరిపోవచ్చు.

ఫ్రాంకా చూస్తే ఉత్త చేతులతో ఉన్నాడు. అంటే అతడు మాకు ఆఫర్ చేసేది ఏమీ లేదు కానీ, మా తిండిలో మాత్రం అతగాడికీ వాటా ఇవ్వాలి. ఇండియాలో ఐతే వేరే సంగతి. మన తిండికి మొహం వాచినవాళ్లం – పంపకాల్లో మా అమృతాన్ని పంచుకుందుకొచ్చినవాడు మాకు రాహువులాగో కేతువులాగో అగుపించడూ?

"మేం చూసేవి నీకు నచ్చవు. నువ్వు చూసేవి మాకు నచ్చవు. అనుకోకుండా కలిశాం. చాలా సంతోషం. ఎవరిదారిన వాళ్లు వెడదాం" అన్నాడు కొరియా.

"నాకు మీతో తిరగాలని మహా సరదా. తీరకుండానే విడిపోతామనుకున్నాను. కానీ కలుసుకునే యోగముంది. ఇలా కలిశాం. ఇక ఈరోజంతా నేను మీతోనే" అన్నాడు ఫ్రాంకా.

నటరాజన్ కావాలని మా అభిరుచుల్ని తక్కువ చేసి అతణ్ణి నిరుత్సాహపరిచే ప్రయత్నం చేశాడు. కానీ ఫ్రాంకా నటరాజన్ మాట ఇలా పూర్తవగానే అలా భలే భలే అని ఉత్సాహపడిపోతున్నాడు.

అతడికి అమృతం పంచక తప్పదని తేలిపోయేక – "మరి ఇది భోజనాల టైము. మావన్నీ ఇండియాలో దక్షిణాది వంటలు. నీకేమో కాంటినెంటల్ ఫుడ్ ఇష్టం. ఏంచేస్తావ్?" అన్నాడు దేవదార్.

"ఓహ్, మీరు కూడా ఫుడ్ తెచ్చుకున్నారా? ప్లానింగ్ విషయంలో ఎవరినైనా మీ ఇండియన్సు తర్వాతే చెప్పుకోవాలి. నేనేమో చేతులూపుకుంటూ వచ్చాను. కొత్త ఊరు. ఏం తినాలీ ఎక్కడ తినాలీ అని ఇందాకట్నించి కొట్టుకుపోతున్నాను. మీకో విషయం తెలుసా? ఫుడ్ ఇండియాదైతే చాలు – ఏ ప్రాంతానిదైనా ఆప్యాయంగా లాగించేస్తాను. మా ఇంట్లో మా అమ్మనేది, నువ్వు ఇండియాలో పుట్టాల్సినవాడివిరా అని" అన్నాడు ఫ్రాంకా.

"పుట్టినా బాగుండేది. ఈ రోజు నువ్వు ఓ ఐటం తెచ్చి ఉండేవాడివి" అనుకున్నాను.

ఫ్రాంకా ఇండియా గురించీ, ఇండియన్ భోజనం గురించీ తెగ పొగిడేస్తుంటే మాకందరికీ మనసుల్లో చిర్రెత్తుకొస్తోంది. చివరికి ఓ పార్కులో కొంచెం అనువుగా అనిపించిన బెంచిల దగ్గర భోజనాలకు కూర్చున్నాం.

కొరియా చేసిన కూర చాలా చాలా బాగుంది. దాంతో అన్నం, కూర అలా ఊదేశాం. అనుకున్నట్లే తిండి ఐదుగురికి సరిపోలేదు. అందుకని మేము కాస్త మొహమాటపడుతుంటే, "ఇలాంటి భోజనం దగ్గర మొహమాటం కూడదు" అంటూ ఫ్రాంకా మా అందరికంటే ఎక్కువ తినేశాడు. అతడి జోరు చూసి మేమూ కాస్త తొందరపడ్డాం కాబట్టి కానీ లేకపోతే ఆ పూట అతడు భీముడూ, మేము మిగతా నలుగురు పాండవులం అయ్యేవాళ్లం.

పాండవులు తెచ్చిన భిక్షని – వారి తల్లి కుంతీదేవి రెండు వాటాలు చేసి – ఒక వాటా భీముడికీ, ఇక వాటా మిగతా నలుగురికీ పెట్టేదన్న విషయం చదువరులకు విదితమేనని నా నమ్మకం.

పదార్థాలు అయిపోయినట్లు తెలియగానే, "మరీ ఇంత తక్కువా తెచ్చేది?" అని మందలించి పుండుమీద కారం చల్లాడు ఫ్రాంకా.

"మాకు బాగానే సరిపోయింది. నువ్వొస్తావని ముందుగా తెలిస్తే మరికాస్త తెచ్చేవాళ్లం" అన్నాను నేను – మాకు తక్కువయిందన్న భావం అతడికి కలక్కూడదని. ఒకసారి అతిథిగా అంగీకరించేక, అతణ్ణి అసంతృప్తికి గురి చెయ్యకూడదు కదా!

దానికి ఫ్రాంకా మరో విధంగా స్పందించాడు. "ఈరోజుకి భోజనం లేదనుకున్నాను. అందుకు మానసికంగా సిద్ధపడిపోయాను కూడా. ఆ సమయంలో ఇంత చక్కని భోజనం పెట్టి నాలో ఆకలిని రేపారు. మీకు ఆకలి తీరిపోతే అది మీ అదృష్టం. నేను మాత్రం ఇప్పుడిక ఎక్కడికైనా వెళ్లి ఏదో ఒకటి తినెయ్యాల్సిందే! థాంక్స్ ఫర్ యువర్ గ్రేట్ హాస్పిటాలిటీ" అని లేచాడు.

"నా దగ్గర కాసిని ఆపిల్సున్నాయి" అన్నాను వెంటనే. అమృతంలాంటి అన్నం, కూర ఇచ్చినవాళ్లం ఇంక ఆపిల్సుకి వెనకాడ్డమెందుకూ అనిపించి.

ఫ్రాంకా తల అడ్డంగా ఊపాడు. రాజుని చూసిన కళ్లతో మొగుణ్ణి చూస్తే మొత్త బుద్ధి కదా! అతడిప్పుడు ఆపిల్ తినలేడుట. వుర్స్‌ట్ (హాట్‌డాగ్స్) లాంటివేమైనా ప్రయత్నిస్తానని అక్కణ్ణించి వెళ్లిపోయాడు. మరికాసేపు మాతో గడపాలన్న కోరిక అతడికున్నట్లు లేదు.

అతడలా వెళ్లిపోతాడని మేమూహించలేదు. మా దగ్గర అన్నం, కూర తినడం కోసమే మాతో కాసేపు కలిసేడా అనిపించింది కానీ జరిగింది కాకతాళీయమని మాకూ తెలియకపోలేదు.

నేను ఆపిల్సు తీశాను. కొన్ని తియ్యగా ఉన్నా, కొన్ని కొంచెం పుల్లగా ఉన్నాయి. ఆపిల్సు తినడమయ్యేసరికి మాకో విషయం అర్థమైంది.

కూర చాలా రుచిగా ఉండడంవల్ల ఆబకొద్దీ చాలలేదనిపించింది కానీ – మాకు కడుపు బాగానే నిండింది. ఆపిల్సు కొన్ని మిగిలిపోయాయి కూడా.

"కొన్ని ఆపిల్సు పుల్లగా అనిపించాయంటే, మనది కడుపు నిండిన బేరం అన్న మాట" అన్నాడు దేవదార్.

అప్పుడు మేము ఫ్రాంకా గురించి చెప్పుకుని సరదాగా నవ్వుకున్నాం. కానీ అతడు ఎందుకు మాతో కాసేపు కలిసి విడిపోయాడన్నది మాత్రం ఎప్పటికీ మిస్టరీయే.

ఉండుండీ ఉడిగుండీ వాన పడుతుండడం వల్ల మాకు ఊళ్లో తిరిగే అవకాశం లేదు. వాతావరణం అనువుగా ఉందని, నటరాజన్ వైన్ బాటిల్, చిన్న గ్లాసులు బైటకి తీశాడు. నా మిత్రులు ముగ్గురూ కాసేపు వైన్ సిప్ చేశారు.

"తిరగడానికి లేదు. కూర్చుని ఎంతసేపు కబుర్లాడుతాం. ట్రయిన్‌కేమో ఇంకా చాలా టైముంది. ఫిల్మ్ చూద్దామా" అన్నాడు దేవదార్.

అక్కడ సినిమా అంటే వేరే చెప్పాలా – నీలి చిత్రమే!

కొంత కాలక్షేపంకోసం. కొంత ఇంకా ఆసక్తి చావక. 'సెక్స్ ప్రాక్సిస్ – 74' సినిమా పేరు. సినిమాకి ఓ పేరుండాలి కాబట్టి కానీ పేరులో ఏముంది?

మన శుకసప్తతి కథల్లాగో, మదనకామరాజు కథల్లాగో – ఎంతో కొంత కథ ఉండి – ఆపైన వాళ్ళిష్టం – ఏం చూపిస్తారో చూపించనివ్వండి. తిండిపోతు ఆబగా ఒకే పదార్థాన్ని గంటల తరబడి తిన్నట్లు పచ్చి శృంగార దృశ్యాలు నిరవధికంగా గంటల తరబడి 'చూసి' ఆనందించే వయసు, స్థాయి కాదు మాది!

అప్పుడవి చాలా కొత్త కాబట్టి – స్వానుభవంలో రెండోసారి కాబట్టి – ఆ చిత్రం తనువుకి కలిగించే అనుభూతులూ తీసిపారెయ్యతగ్గవి కాదు. ఇండియన్సుమి కాబట్టి ఎవరి భావాలు వాళ్ళం మనసుల్లోనే దాచుకున్నాం.

రాత్రి పదకొండు గంటలకల్లా సినిమా అయిపోయింది. ఆ సినిమా ప్రభావం మమ్మల్ని మామూలు మనుషుల్ని చెయ్యడానికి కనీసం పావుగంట పట్టింది.

అంత రాత్రి పూట రోడ్లమీదేం తిరుగుతాం! నడుచుకుంటూ రైల్వేస్టేషను చేరుకున్నాం.

దేవదార్, కొరియాల ట్రయిన్ ఇంచుమించు వెంటనే వచ్చేసింది. ఇక నేను, నటరాజన్ మిగిలాం.

హానోఫర్‌నించి బెర్లిన్ వెళ్లే ట్రైన్ రాత్రి ఒంటిగంటం పావుకి. అంటే రెండు గంటలపైన వెయిటింగ్. రాత్రి కావడంవల్ల ఆ వెయిటింగ్ బాగా బోరు కొట్టింది. ఏమైతేనేం కాలం ఆగదు కదా....

ట్రయినొచ్చే టైముకి లాకర్లోంచి సూట్‌కేస్ తీసుకున్నాను. ట్రైన్ రాగానే అందులో దూరి నటరాజన్‌కి బై చెప్పాను. అతడు వెళ్లాల్సిన ఊరు వేరు. ఆ ట్రైన్ కోసం మరికాసేపు ఎదురుచూడాలి....

బెర్లిన్ ద్వీపయాత్ర

నా సీట్లో కూర్చున్నాను. ట్రయిన్ లోపల వెచ్చగా బాగుంది.

నా ఎదుటి సీట్లో ఓ జంట కూర్చున్నారు. వయసు, ఉత్సాహం – రెండూ జతపడి, వాళ్లు నన్ను పట్టించుకోకుండా తమ సరదాలో తామున్నారు. అలా వేడెక్కిపోతున్నారో ఏమో, మధ్యమధ్య బోగీ కిటికీ తలుపులు తెరిచి కాసేపుంచి మళ్లీ మూసేస్తున్నారు.

కిటికీ తీసినప్పుడల్లా చలిగాలి రయ్యిమని లోపలికొస్తోంది. అది నన్ను గజగజ వణికిస్తోంది. ఆ జంటమాత్రం సముద్రంలో బడబాగ్నిలా ఆ చలిగాలికి ఏమాత్రం చలించడం లేదు.

కిటికీ తలుపులు తియ్యొద్దని చెప్పాలనుంది కానీ మొహమాటం వేసింది. చలికి తట్టుకునే అలవాటుంది కాబట్టి ఎలాగో కాసేపటికి నిద్ర పట్టింది. అలసట కూడా తోడై ఆ నిద్రని గాఢం చేసిందనుకుంటే – బెర్లిన్ చేరేలోగా మధ్యలో ఓసారి టికెట్టు చెకింగ్‌కీ, రెండుసార్లు పాస్‌పోర్టు చెకింగుకీ వచ్చినవాళ్లవల్ల నిద్రాభంగమయింది.

ప్రయాణం మధ్యలో పాస్‌పోర్ట్ చెక్ చెయ్యడానికి కారణముంది.

రెండవ ప్రపంచయుద్ధానికి ముందుదాకా డాయిచ్‌లాండ్ అనగా జర్మనీ ఒకే దేశం. యుద్ధం తర్వాత అది తూర్పు పశ్చిమ భాగాలుగా విడిపోయింది.

రెండు భాగాలూ కలిసున్నప్పుడు బెర్లిన్ జర్మనీ ముఖ్యపట్టణం. విడిపోయేక బెర్లిన్ నగరం తూర్పు జర్మనీలో ఉండిపోయింది.

అయితే బెర్లిన్ వంటి మహానగరాన్ని వదులుకుందుకు పశ్చిమ జర్మనీ ఒప్పుకోలేదు.

తమ దేశం మధ్యలో ఉన్న పట్టణాన్ని వదులుకోవడానికి తూర్పు జర్మనీ ఇష్టపడలేదు.

అప్పుడు రెండవ ప్రపంచయుద్ధంలో నెగ్గిన అగ్రరాజ్యాలన్నీ ఒక ఒప్పందానికొచ్చి, బెర్లిన్ నగరాన్ని కూడా రెండు భాగాలుగా విడగొట్టి రెండు దేశాలకీ పంచాయి.

తూర్పు బెర్లిన్ తూర్పు జర్మనీకి రాజధాని. దాన్ని ఆనుకునే ఉన్న పశ్చిమ బెర్లిన్ – కావడానికి పశ్చిమ జర్మనీలో ఒక భాగమైనా, ఉండడం తూర్పు జర్మనీలోనే ఉంది.

ఈ పరిస్థితి కొన్ని విచిత్రమైన ఏర్పాట్లకి దారి తీసింది.

తూర్పు జర్మనీ 'ఇనుప తెర'ల చాటున ఉండే అప్పటి రష్యాని అనుసరించే కమ్యూనిస్టు దేశం. పశ్చిమ జర్మనీ పాశ్చాత్యుల స్థాయి స్వేచ్ఛకి మారుపేరు.

అలాంటప్పుడు తూర్పు బెర్లిన్ పౌరులకి – తమ భాషనే మాట్లాడే సహోదరులతో నిండిన – పశ్చిమ బెర్లిన్ నగరానికి వలస పోవాలనిపించడం సహజం. అలా జరక్కుండా – తూర్పు జర్మనీ – తూర్పు బెర్లిన్ నగరానికి నిర్దుష్టమైన ఎల్లలు నిర్ణయించింది. ఆ ప్రకారం గోడకట్టి రెండు నగరాల్నీ భౌతికంగా వేరు చేసింది.

ఆ వేర్పాటులో అంకెలు, కొలతలే తప్ప మానవత్వం లేదు.

ఆ గోడ కట్టినప్పుడు ఎన్నో ఇళ్లు రెండయ్యాయి. కుటుంబాలు విడిపోయాయి. బంధుత్వాలు విడిపోయాయి. చరిత్ర పుటల్లో ఆ గోడ నిర్మాణమొక కన్నీటిగాథ.

నేనిప్పుడు పశ్చిమ జర్మనీకి చెందిన పశ్చిమ బెర్లిన్‌కి వెడుతున్నాను. కానీ ఆ నగరం తూర్పు జర్మనీలో ఉండడంవల్ల – నా పాస్‌పోర్ట్ ఒకటికి రెండు సార్లు చెక్ చెయ్యబడింది.

చుట్టూ తూర్పు జర్మనీ. మధ్యలో పశ్చిమ జర్మనీకి చెందిన పశ్చిమ బెర్లిన్. డాయిచ్‌లాండే బెర్లిన్ ద్వీపే అనడంలో నా ఆంతర్యమిదే.

ఊరు కొత్త. ట్రయిన్ దిగేక రైల్వేస్టేషన్లో సదుపాయాలెలా ఉంటాయో తెలియదు.

ఎందుకైనా మంచిదని తెల్లారి అయిదున్నరకల్లా లేచి ట్రయిన్లోనే కాలకృత్యాలు కానిచ్చేశాను.

ట్రయిన్ పశ్చిమ బెర్లిన్ స్టేషన్ చేరుకునేసరికి టైం ఆరున్నర కావస్తోంది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments